
ప్రజాశక్తి
బుధవారం 4 సెప్టెంబర్ 2024




5న ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్టు జిల్లా విద్యా శాఖ అధికారి గార పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురుపూజోత్సవం ఈనెల 5న ఉదయం 9 గంటలకు లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో పురస్కారాలు, గౌరవసత్కారాలు జరుగుతాయన్నారు. జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ , ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆమె చెప్పారు.

ఇక విద్యుత్తు స్మార్టు మీటర్లు

- తొలుత ప్రభుత్వ కార్యాలయాలు.. తరువాత సామాన్యుల ఇళ్లకు
- కార్పొరేట్‌శక్తుల కోసం డేటాసేకరణే అసలు లక్ష్యమా?
- గల్లంతుకానున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్ ఉద్యోగాలు
- ప్రీపెయిడ్‌తో వ్యవసాయ పంపుసెట్లకు ఆటంకం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అభివృద్ధిలో అత్యంత వెనుకబడిన విజయనగరం జిల్లాలోనూ విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాట్లు మొదలైంది. అమలు సులువు చేసుకునేందుకు తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు అమరుస్తున్నారు. ఆ తరువాత క్రమంగా వ్యవసాయ పంపుసెట్లు, సామాన్యుల ఇళ్లకు కూడా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ విధానం వెనుక కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు, ప్రజలకు తెలియకుండానే వారిపై భారాలు మోపడం వంటి కుట్రలు దాగివున్నాయి. గత ఐదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వద్ద అప్పుల కోసం లాలూచీపడిన వైసిపి ప్రభుత్వం విద్యుత్ రంగంలో ప్రైవేటు సంస్కరణలకు అమలుకు పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రభుత్వం మారినప్పటికీ ఇటీవల ఎన్నికల్లో బిజెపితో కూటమి కట్టిన సిఎం చంద్రబాబు కూడా విద్యుత్ రంగంలో తీసుకొచ్చిన నాటి విధానాలు యథాతథంగా ముందుకు తీసుకెళ్లేం దుకు తహతహలాడుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే పలు జిల్లాల్లో స్మార్ట్ మీటర్లు అమర్చిన ప్రభుత్వం తాజాగా ఉమ్మడి విజయ నగరం జిల్లాలో స్మార్ట్‌మీటర్లు అమలుకు మరో అడుగు వేసింది. ఈ ఉమ్మడి జిల్లాలో సుమారు 9,73,000 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోగదారులు అత్యధికంగా 7,99,899 వరకు ఉన్నారు. గృహేతర (కర్షియల్) సర్వీసులు 91,731 ఉన్నాయి. 4,851 పరిశ్రమలు, 20,938 కుటీర పరిశ్రమల సర్వీసులు, 684 హెచ్‌డి కనెక్షన్లు ఉన్నాయి. ఇవి కాకుండా 55,778 వ్యవసాయ పంపుసెట్ కనెక్షన్లు కూడా ఉన్నాయి. వీరందరికీ విద్యుత్ ఉద్యోగులు మాన్యువల్ లేదా స్కానర్ ద్వారా బిల్లులు తీసి అందజేస్తున్నారు. స్మార్ట్‌మీటర్లు పూర్తిగా అమర్చాక సెల్‌ఫోన్ల రీఛార్జి మాదిరిగా ప్రీపెయిడ్ విధానం అమల్లోకి రానుంది. అది అమల్లోకి వచ్చిన తరువాత నిర్ధేశించిన విద్యుత్ యూనిట్ల వినియోగం తర్వాత ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. కాబట్టి సెల్‌ఫోన్ రీఛార్జి మాదిరిగా వినియోగదారుల నుంచి ముందస్తుగా మూడు నెలలు, ఆరుమాసాల ఆఫర్లు పెట్టి జనం నుంచి అడ్వాన్సులు వసూలు చేసే పరిస్థితి వస్తుంది. ఇప్పటి వరకు సుమారు 300కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు అమర్చినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ విధానం క్రమంగా అన్ని కేటగిరీ సర్వీసుల్లోనూ అమలు కానుంది. ముఖ్యంగా గృహ వినియోగదారులపై ఆర్థిక భారం పడడంతోపాటు, ప్రైవేటు పరిశ్రమల మనుగడకు ఇబ్బంది కలుగుతుంది. ట్విమ్స్ మిషన్ల అమలు తరువాత ఆర్‌టిసిలో కండక్టర్ ఉద్యోగాలు తగ్గి, ఇతర ఉద్యోగాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మాదిరిగా మారిపోయినట్టు, విద్యుత్ రంగంలోని ఈ సంస్కరణల వల్ల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో పాలిటెక్నిక్, ఐటిఐ వంటి అర్హతలతో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఉద్యోగాలు గల్లంతవుతాయి. ఈ రంగంలో భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి కల్పన, రిజర్వేషన్లు అమలు వంటివి కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు క్రమంగా రైతులు కూడా ప్రీపెయిడ్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. మరోవైపు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా వినియోగదారులు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వస్తుసామగ్రి డేటాను సేకరించి ప్రైవేటు పెట్టుబడిదారులకు కట్టబెట్టే అవకాశాలు లేకపోలేదు. తద్వారా వినియోగదారులకు అవసరమైన ఉత్పత్తులను తయారుచేసి మార్కెట్ చేసు కునేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఈ విధానం వల్ల పెట్టుబడిదారులు లాభాలు పొందడంతో పాటు ఉన్న ఉద్యోగాలకు ఎసరు వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

హామీలను అమలు చేయాలి

జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్ల నిరసనలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్ద బొండపల్లి పిహెచ్‌సి ఎదుట ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరీశ్రీ, పద్మ, త్రివేణితో కలిసి ధర్నా నిర్వహించిన అనంతరం వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్యకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆశా వర్కర్ సంఘంతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందపు జీవోలను వెంటనే అమలుచేయాలని, అంతవరకు ఆశాల రిటైర్మెంట్లు ఆపాలని, వారికి సంబంధించిన రికార్డులను వెంటనే అందజేయాలని, కలకత్తా ట్రైనీ డాక్టర్‌పై అఘాత్యానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, పనిచేస్తున్న ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సాలూరురూరల్ : ఆశాలకు ఇచ్చిన జిఒలను వెంటనే అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన జిఒలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండలంలోని మామిడిపల్లి, తోణాం, బాగువలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశాలు నల్లబ్యాడ్జీలు ధరించి సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పోరాటాల సమయంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఆశాల రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకుగా పెంచాలని, నష్ట పరిహారంగా ప్రభుత్వం జిఒ విడుదల చేసిందని, కానీ నేటికీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆ జిఒలను అమలు చేసే వరకు ఆశాలను రిటర్మెంట్ చేయొద్దని, మరణించిన ఆశాల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు నిరోధకల కమిటీ వేసి రక్షణ కల్పించాలని, కలకత్తా ట్రైనీ విద్యార్థిపై అఘాత్యానికి పాల్పడ్డ వ్యక్తులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా పిహెచ్‌సిల పరిధిలో గల వైద్యాధికారులకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు రవణమ్మ, ఆదిలక్ష్మి, సరోజిని, త్రివేణి, గౌరమ్మ, రాజేశ్వరి, శ్రీదేవి, లక్ష్మి, సునీత, భారతి, మరియమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొండ : యుపిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ ధర్నా అనంతరం వైద్యాధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి మాట్లాడుతూ ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, ఆశాల రిటైర్మెంట్ ఆపాలని, రికార్డులు వెంటనే ఇవ్వాలని, కలకత్తా ట్రైనీ విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, ఆశా కార్యకర్తల, ఎఎన్ఎంల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.శాంతి, ఎం.ధనలక్ష్మి, పి.శ్రీదేవి, రాధా రాణి, అర్బన్ ఆషా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : గురువు నాయుడుపేట, పాచిపెంట పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు పి.నాగవేణి, కె.నిర్మల, చండీప్రియ, మంజుల ధర్నా చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, పెద్దసంఖ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : ఆశా వర్కర్లకు ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం వెంటనే జిఒలు అమలు చేయాలని, కలకత్తాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో కొమరాడ, కెఆర్‌బి పురం పిహెచ్‌సిల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయా పిహెచ్‌సి వైద్యాధికారులకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పార్వతీపురం : వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు


పాలకొండ : వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు


సాలూరు : వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



పాచిపెంట పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు


అసంపూర్తిగా ఉన్న సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కలగా మిగిలిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు నత్త నడకన నడవడం వల్ల దానిలో సేవలు కలగా రోగులకు మిగిలాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, కమిటీ సభ్యులు బంకురు సూరిబాబు, పి.రాము, సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మూడేళ్లయినా పూర్తి కాలేదని, ఇలాగే నిధులు వస్తే మరో మూడేళ్లు పడుతుందన్నారు. జిల్లాలో జ్వరాలతో మరణాలు, పేదలకు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆర్థిక భారం తగ్గాలంటే వెంటనే హాస్పిటల్, వైద్య కళాశాల పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శంకుస్థాపన చేసిన ఏడాదిలోనే పూర్తి చేస్తామని, నిధులను సిద్ధంగా ఉన్నాయని ప్రకటించారని, అయితే మూడేళ్లయినా సగం పనులు కూడా పూర్తి కాలేదని అన్నారు. పరిశీలించిన పనులను చూస్తే ఇంకా మరో మూడేళ్లు దాటి నిర్మాణ పనులు జరిగే పరిస్థితి ఉందన్నారు. నిర్మాణంలో కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని, వాటిని జిల్లా అధికారులు పరిశీలించి సరిచేయాలని కోరారు. వైద్య సౌకర్యాలు మెరుగుపడాలంటే ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెంటనే నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతూ బుధవారం డిఎంహెచ్‌ఒ ఆఫీస్ వద్ద తలపెట్టిన ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పాఠశాలలు జాతీయ స్థాయి అవార్డులు సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పాఠశాలలు జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పిఎంశ్రీ కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పాఠశాలలు అగ్రగామిగా నిల్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో నిగూఢంగా ఉన్న సృజనాత్మక శక్తిని బయటకు తీయాలని, ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో నిష్ణాతుడిగా తయారు కావడానికి అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచిం చారు. విద్యార్థులను సైన్స్ ఫెయిర్, క్రీడా ఉత్సవాలు, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి వాటి పట్ల స్పష్టమైన అవగాహన వచ్చేలా చేయాలని, భవిష్యత్తులో స్వతహాగా కార్యక్రమాలు చేపట్టే స్థాయికి తీసుకు వెళ్లాలని సూచించారు. ప్రతి విద్యార్థి సొంతంగా ఒక కార్యక్రమాన్ని గూర్చి వివరించడంతో పాటు చేసి చూపించే స్థాయిలో ఉండాలని అన్నారు. ఇందుకుగాను విద్యతో పాటు ఇతర కార్యకలాపాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని ఆయన చెప్పారు. మా బడి - మా తోట వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టి వాటిలో కాయగూరలను పెంచడం మాత్రమే కాకుండా వాటి వల్ల అందే పౌష్టిక ఆహార విలువలు, వ్యవసాయం, మొక్కల పెంపకంలో మెలకువలు వంటి అంశాలను బోధించాలని అన్నారు. క్రీడల్లో శిక్షణ ఇస్తూ మంచి మెలకువలు నేర్పించాలని తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఒక్కో రకమైన కార్యకలాపాల్లో చొరవ తీసుకోవాలని తద్వారా పిల్లలకు వాటిలో ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వవచ్చని చెప్పారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. సోషల్ మీడియాను ఏర్పాటు చేసి పాఠశాలల్లో చేస్తున్న మంచి కార్యక్రమాలను పోస్ట్ చేయవచ్చని తద్వారా పిల్లల్లో సైతం ఆసక్తి పెరుగుతుందని ఆయన సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డిఇఒ పగడాలమ్మ, నోడల్ అధికారి లక్ష్మీకాంత్

పిఎం శ్రీ పాఠశాలలు ప్రత్యేకతను చాటుకోవాలి

పిఎం శ్రీ కార్యక్రమం కింద జిల్లాలో 19 పాఠశాలలు ఎంపికయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, మైదానం ఇతర మౌలిక సదుపాయాలు పరిశీలించిన మీదట ఎంపిక చేస్తామని చెప్పారు. 19 పాఠశాలలు మరిన్ని ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ స్థాయి అవార్డులు పొందేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఇందుకుగాను గణాంకాలను కచ్చితత్వంతో ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. సమావేశంలో డిఇఒ జి.పగడాలమ్మ, నోడల్ అధికారి పి.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఇసుక పంపిణీలో అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఇసుక పంపిణీలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ, ఇరిగేషన్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భామిని మండలం కాట్రగడ్డ వద్ద గల ఇసుక ర్యాంపులో ఇసుకను వెలికితీసేందుకు జరుగుతున్న ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇసుక ర్యాంపులో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక వెలికతీత, విక్రయాల కార్యకలాపాలు నిర్వహించాలని, అనంతరం ఎవర్నీ లోపలికి అనుమతికూడదని, గేటు ఏర్పాటు చేసి తాళం వేయాలని తెలిపారు. స్టాకు పాయింటు వద్ద సిసి కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లాలో గల తోటపల్లి, వంశధార, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహిస్తూ తోటపల్లి ఫేజ్-2 విస్తరణ పనులను పూర్తిచేయాలని తెలిపారు. భూసేకరణ, ప్రాజెక్టుల పరిస్థితి వివరాలు అధికారులు వివరించారు. తోటపల్లి ప్రాజెక్టుకు డిజాస్టరు మేనేజ్మెంటు ప్లాను తయారు చేయాలని కలెక్టరు తెలిపారు. జిల్లాలో గల సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ తనిఖీచేసి రిపోర్టు సమర్పించాలని తెలిపారు. ప్రాజెక్టులు, చెరువులు, నీటిపారుదల శాఖ భూములు, కాలువల్లో ఆక్రమణలను తొలగించాలన్నారు. నీటి తీరువా వసూలు చేయాలని తెలిపారు. జిల్లాలోని మారుమూరు ప్రాంతం విశాఖ దగ్గరలో ఉందని, ఆ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ టూరిజం, పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలపై నివేదిక తయారు చేయాలని జాయింటు కలెక్టరును ఆదేశించారు. సమావేశంలో జాయింటు కలెక్టరు ఎస్.ఎస్. శోభిక, వంశధార ఇఇ రామచంద్రరావు, డిటిఒ ఎం.శశికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక ఎస్‌విడి కాలేజీ ఆవరణంలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి పొందేందుకు మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. యువత త్వరగా ఉద్యోగంలో స్థిరపడి కుటుంబా నికి అండగా ఉండాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. త్వరలో నిర్వహించే జాబ్ మేళాలకు 12, 13 కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని, యువత పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలేజీ వైస్‌ప్రిన్సిపల్ బి.శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నతా శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ జాబ్‌మేళాకు వనిత లాబ్స్, మంజుశ్రీ టెక్నో ప్యాక్, కెఎల్ గ్రూప్ - అమెజాన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 205 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 89 మంది ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో డిపిఆర్‌ఒ ఎల్.రమేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్.వహీదా, సిడాప్ ప్లేస్ మెంట్ అధికారి అశోక్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు ఎం.కంచిబాబు, మనోజ్, డి ప్రవల్లిక, ఆర్.అశ్విని, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎపి బ్రేవరేజెస్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాలోని మద్యం షాపు సూపర్‌వైజర్లు, సేల్స్‌మాన్లు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ మద్యం షాపుల సూపర్ వైజర్, సేల్స్ మాన్ల సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యల్ని వివరించారు. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో నియమించడ్డామని, ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం విధానం అమలు చేయడం ద్వారా తాము ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని చెప్పారు. ఈనెల 6లోగా తమకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని, లేకుంటే 7 నుంచి మద్యం షాపుల బంద్ చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

నగర పంచాయతీ కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని లుంబూరు వద్ద గల పాలకొండ అర్బన్ లే అవుట్ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నగర పంచాయితీ కార్యాలయంలో హౌసింగ్ ఎఇ, ఎమినిటీస్ సెక్రటరీలు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. 2025 మార్చి నాటికి గృహాలు పూర్తికావాలని, అనంతరం వాటికి బిల్లులు పడవని తెలియజేశారు. లబ్ధిదారులంతా శ్లాబులు, ప్లాస్టరింగ్ కిటికీల పనులు పూర్తిచేసేలా చూడాలన్నారు. గృహ లబ్ధిదారుల వివరాలను పరిశీలించి ఇళ్ల స్టేజ్ అప్డేషన్ గూర్చి పూర్తి వివరాలను సమీక్షించారు. సంబంధిత లబ్ధిదారుల మేస్త్రీలతో ఫోనులో మాట్లాడి త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు శతశాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణాలకుగాను యంత్రాంగమంతా అన్ని వసతులు కల్పిస్తున్నందున లబ్ధిదారులంతా వారి గృహ నిర్మాణాలు ఉత్సాహంగా పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. సిబ్బంది అంతా పూర్తి నిబద్ధతతో పనిచేసి గృహ నిర్మాణదారులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసి నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ జగన్మోహనరావు

పౌష్టికాహార లోపానికి గురికారాదు

ప్రజాశక్తి - సాలూరు

ఆరోగ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించి, మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్‌తో కలిసి శంబర, మక్కువ, బలిజిపేట, అరసాడ పిహెచ్సీలు, సాలూరు పిపి యూనిట్ లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాలను మంగళవారం సందర్శించారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ఆరోగ్య సమస్యలు ఎక్కువగా నమోదవుతున్న గ్రామాల్లో దృష్టి సారించాలని, అందుకు గల కారణాలపై సంబంధిత శాఖలతో సమన్వయం జరిపి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి శిశువులు, గర్భిణీలు పౌష్టికాహార లోపానికి గురికాకుండా కృషి చేయాలని చెప్పారు. రక్తహీనత గుర్తించిన గర్భిణీలు, బాలింతలు, శిశువులు, కిశోర బాలికలు, మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాల వివరాల జాబితాను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తూ సత్వరమే చికిత్స అందించి వారి ఆరోగ్య స్థితి మెరుగుపడే వరకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచి అక్కడ ప్రజలు వైద్యపరంగా ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలున్న వారిని క్షేత్ర స్థాయిలో త్వరగా గుర్తించడంలో ఆశా కార్యకర్తలు కీలకంగా ఉండాలన్నారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమం ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంపొందించి అందరిని భాగస్వామ్యం చేస్తూ ప్రజల మెరుగైన ఆరోగ్యానికై కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘు కుమార్, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ నిఖిల, డాక్టర్ శశిధర్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మాధురి, డాక్టర్ ప్రియాంక, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న టిడిపి నాయకులు వీరేష్‌చంద్రదేవ్

కలెక్టర్‌ను కలిసిన వీరేష్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వీరేశ్ చంద్రదేవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్నటువంటి దీర్ఘకాలిక సమస్యలు కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లే సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈయనుతో పాటు నియోజకవర్గంలో గల కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వితరణ

ప్రజాశక్తి - కొమరాడ

ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైనప్పుడు సహాయక సహకారాలు అందిస్తామని మాదలింగి సర్పంచ్ తుమరాడ కళావతి అన్నారు. మంగళవారం మాదిలింగిలో గల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుమరాడ కృష్ణమూర్తినాయుడు జ్ఞాపకార్థంగా వారి భార్యకళావతి చేతుల మీదగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 22 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య కమిటీ చైర్మన్ సారధి దేవి, ఉపాధ్యాయులు బి. సంతోషికుమారి పాల్గొన్నారు.

జీడి సాగు పునరుద్ధరణపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

జీడి పంట పునరుద్ధరణపై నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఉద్యాన సంస్థ ఆధ్వర్యంలో మండలంలో నీలకంతాపురం, వబ్బంగి పంచాయతీలో గల జీడి రైతులకు కోసంగూడలో సిఇఒ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉద్యానవన శాఖ అధికారి సిహెచ్ గిరిజ రైతులకు జీడి పంటల పునరుద్ధరణ, జీడి తోటల యాజమాన్యంలో కొమ్మల కత్తిరింపు, ఎరువుల యాజమాన్యం, అధిక దిగుబడి సాధించడానికి చేయాల్సిన పనుల గురించి తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కన్సల్టెంట్ ఎస్ .సోనియా, గ్రామ పెద్దలు ఎం.గణపతి, ఎం.అడ్డమేశ్వర రావు, బి. దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న లోవముతా ప్రాంత నాయకులు

మా ప్రాంత అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యేకు లోవముతా గిరిజనులు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

లోవముతా ప్రాంతంలోని పది పంచాయతీల్లో గల గిరిజన గ్రామాలకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. గత ప్రభుత్వంలో తమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దీంతో గిరిజనులు నేటికీ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం హయాంలోనే గిరిజన ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కోరారు. సమస్యలకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ లోవముతా ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, నాయకులు కళావతి, లక్ష్మణరావు, ధర్మరావు, దాసు, అనిల్, రమేష్, లోవముతా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వివరాలు అందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పారిశుధ్య కార్మికులుంటే వారి వివరాలు అందించాలని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికరిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం, సాలూరు పురపాలక సంస్థలు, పాలకొండ నగర పంచాయతీ, జిల్లా పంచాయతీ అధికారి జిల్లాలో అపరిశుభ్ర వృత్తి చేసే పనివారు జిల్లాలో లేరని నిర్ధారించి ఉన్నారని చెప్పారు. జిల్లాలో అపరిశుభ్ర పనివారు వత్తిలో ఉంటే వారి వివరాలు ఈ నెల 9వ తేదిలోగా ఆర్‌సిఎం భవన సముదాయంలో ఉన్న ఎఫ్ 1, 2 గదుల్లో గల జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికరిత అధికారి కార్యాలయంలో వివరాలు అందించాలని కోరారు. వివరాలు రాని ఎడల జిల్లాలో అపరిశుభ్ర పనివార వృత్తి చేసిన వారు లేనట్లుగా ధ్రువీకరించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

పిఎం జన్‌మన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంతో గిరిజన గ్రామాలు శాతం అభివృద్ధి అవుతాయని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం కోటిపాం పంచాయతీ గుంపగదబవలసలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు ఏర్పాటు చేసి గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ చర్యలు చేపడుతుందని తెలిపారు. గ్రామంలో నివసిస్తున్న ప్రతి గిరిజనుడికి పక్కా ఇల్లు నిర్మించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం సక్రమంగా అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ఎస్.సుగుణ, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ నవీన్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎపిఎం వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి హేమ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

ప్రజాశక్తి - సీతంపేట

యువత మత్తు పదార్థాలకు అలవాటుపడొద్దని ఎస్సై ఎం.జగదీష్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌టిఆర్ పార్కు వద్ద యువతకు అవగాహన కల్పించారు. గంజాయి, ధూమపానం వంటికి దూరంగా ఉండాలన్నారు. దీనివల్ల మీ బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు యువత సహకరించాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయరాదని, ట్రిబుల్ రైడింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహనదారులకు హెల్మెంట్, సి- బుక్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉంటేనే రోడ్డుపైకి వాహనం నడపాలని చెప్పారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. ఓవర్ లోడు వేయరాదని అవగాహన కల్పించారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగదీష్‌నాయుడు

రోడ్లపై పశువుల స్వైరవిహారం

- మున్సిపల్ శాఖ మంత్రి ఆదేశాలు పట్టించుకోని అధికారులు
- ఉదాసీనంగా పెంపకం దారులు
- పాదచారులు, వాహన చోదకులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రధాన రహదారిలో దర్జాగా పశువులు సంచరిస్తుండడంతో వాటిని నియంత్రించేందుకు స్థానిక మున్సిపల్, ఆర్అండ్‌బి, ప్రజారోగ్య విభాగం అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. రోడ్లపై పశువులు సంచరిస్తే ఉపేక్షించేది లేదని సాక్షాత్తు మున్సిపల్ శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం, వాటి నియంత్రణ వైపు అడుగులు వేయాల్సిన ఆయా శాఖల అధికారులు వ్యవరిస్తున్న తీరుపై పట్టణ ప్రజలతో పాటు, ప్రధాన ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రధాన రహదారిలో పశువులు సంచరించడమే కాక రహదారిపై ఉన్న వ్యర్థాలను చిందర వందర చేస్తున్నాయి. అంతేకాక పట్టణ ప్రధాన కూడళ్ల వద్ద అవి తిష్ట వేయడంతో పాదచారులు, వాహనచోదకులకు, ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీస్ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తూ, పలు సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి ఆసుపత్రులు పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా వీటి యజమానులకు చీమకుట్టైన లేకపోవడం గమనార్హం. పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పాటైన అనంతరం జిల్లా కలెక్టర్‌గా మొదటి సారిగా బాధ్యతలు చేపట్టిన నిశాంత్ కుమార్ పట్టణ సందర్శనలో భాగంగా ప్రధాన రహదారిపైనే పశువుల సంచారం ఉండడం గమనించారు. దీంతో మున్సిపల్ అధికారులకు వాటిని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టమని అప్పట్లో ఆదేశాలు జారీ చేశారు. అయినా ప్రధాన రహదారిపై పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పి.నారాయణ రోడ్లపై పశువుల సంచారాన్ని సంబంధిత అధికారులు నియంత్రించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ రోడ్లపై ఉన్న పశువుల సంచారంపై దృష్టి పెట్టకపోవడమేమిటని పట్టణ ప్రజలతో పాటు రోడ్లపై రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, భారీ వాహనదారులు సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై పశువులు, పందులు సంచరిస్తే కఠిన చర్యలు : కమిషనర్

మున్సిపల్ పరిధిలో గల ప్రధాన రహదారితో పాటు వార్డుల్లో ఉన్న రహదారులపై పశువులు, పందులు సంచరిస్తే సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ పశువులు, పందుల పెంపకందారులను హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత యజమానులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో మాట్లాడుతూ, పట్టణ ప్రధాన రహదారి, మార్కెట్ రోడ్డుపైన పశువులు, పందుల సంచారంతో స్థానిక ప్రజలతో పాటు పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు భారీ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు సంభవించి పలువురు గాయాలపాలు పాలవుతున్నారని అన్నారు. ప్రధాన రహదారిపై పశువులు, పందులు సంచారం నిషేధించడం జరిగిందని, వీటిని రహదారిపై రాకుండా చూసుకోవాలన్నారు. ఇప్పటికే సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు సంబంధిత యాజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. మున్సిపల్ నిబంధనలు బేఖాతరు చేసిన సంబంధిత యజమానులకు అపరాధ రుసుంతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, సెక్రెటరీలు, మేస్త్రీలు, పట్టణ పశువులు, పందుల యాజమానులు పాల్గొన్నారు.



పార్వతీపురం మెయిన్‌రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులు

నేడు కోటిపాంలో మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో కోటిపాంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని దీన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుంకరి సుగుణ అన్నారు. విజయనగరం మిమ్స్ హాస్పటల్ నుంచి వైద్యులు వచ్చి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

కురుపాం : ప్రతి ఒక్కరికీ సుఖవ్యాధులు, హెచ్ఐవిపై అవగాహన కలిగి ఉండాలని వైడిఒ నెట్వర్క్ ఔట్ రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. మంగళవారం కురుపాం పంచాయతీ పరిధిలో గల కస్పా గదబవలసలో మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. హెచ్ఐవి సోకిన వారిని చిన్నచూపు చూడకుండా ఉండేలా ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ మోహన్‌రావు, జనసేన నాయకులు బి.మురళి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన అధికారి

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మంగళవారం జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఎండి గయాజుద్దీన్ తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపడుతున్న చర్యల గురించి మేట్రిన్ కె.కూర్మమ్మను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు విరివిగా పడుతున్న కారణంగా విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థినులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

పోషకాహారం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పాఠశాలల్లోని విద్యార్థులకు పోషకాలతో కూడిన, పిల్లలు యిష్టపడే రుచికరమైన మెనూ అందించాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జిల్లా కలెక్టరు అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంటు కమిటీలు, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వర్కర్లు, విద్యార్థులు పాల్గొని ప్రస్తుతం అందిస్తున్న మెనూ, దానిలో తీసుకురావాల్సిన మార్పులపై చర్చించి పాఠశాల మేనేజ్మెంటు కమిటీలు, విద్యార్థుల అభిప్రాయానికి అనుగుణంగా మెనూలో కొన్ని మార్పులు చేశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ మధ్యాహ్న బడి భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూలో జిల్లా స్థాయిలో స్థానిక ఆహారపు అలవాట్లకు, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా మార్పులు చేసుకొనేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారంలో పోషకవిలువలు కోల్పోకుండా వారు ఇష్టపడేలా రుచికరంగా తయారు చేయాలని తెలిపారు. ఆకుకూరలు ఆహారంలో తప్పని సరిగా భాగం చేయాలన్నారు. సాంప్రదాయ భోజనం పట్ల విద్యార్థులు ఇష్టం పెంచుకొనేలా ఆహారాన్ని రుచికరంగా తయారుచేయాలని మధ్యాహ్న భోజన నిర్వహకులకు సూచించారు. పోషకాలు కోల్పోకుండా రుచికరంగా వంటలు చేయడంలో మధ్యాహ్న భోజన నిర్వహకులకు అవగాహన, శిక్షణ అందించాలని తెలిపారు. ఆకుకూరలు, కాయగూరలు కోసం ప్రతి పాఠశాలలో మనబడి-మనతోట సిద్ధం చేయాలని, ఇప్పటికే చాలా పాఠశాలలకు విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలతో తప్పని సరిగా న్యూట్రిషన్ గార్డెన్ పెంచాలని తెలిపారు. జాతీయ పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, గర్భిణులు, బాలికల్లో పోషకాలు, రక్తహీనత లోపం లేకుండా ఆహారం తీసుకొనేలా అవగాహన, ప్రచారం నిర్వహించాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడాలమ్మ, పాఠశాల మేనేజ్మెంటు కమిటీలు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పౌష్టిక ఆహార వారోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ, వైద్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1 నుంచి పౌష్టికాహార వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థినిలకు, గర్భిణీలకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అంగనవాడీ కేంద్రాల్లో ఉన్న గర్భిణీలకు సీమంతాలు, పిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. మిల్లెట్స్‌తో వంటలు చేసి వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ సిబ్బందికి ఉందన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కొమరాడ వైద్యాధికారి అరుణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారదాంబ, అరుణ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలకు తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషణపైన అవగాహన శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతూ అంగన్వాడీ నిర్వహణ, మహిళల పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామస్థాయిలోనే సంపూర్ణ పోషణ అభియాన్ నిర్వహించడానికి గ్రామస్తులందరికీ అవగాహన కల్పించడం, సిరి ధాన్యాల సాగు, వాటి వాడకం ముఖ్యమని అన్నారు. జాతీయ పోషణ వారోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయి ఆరోగ్య కార్యదర్శి, ఆశా, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో అందరికీ పోషణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనతను తగ్గించడానికి ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాలు రోజువారి తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో వైద్యాధికారి చాందిని సూపర్వైజర్ లావణ్య, మిస్సమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి అన్నారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదగుడబ ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో గల ఉల్లిభద్ర అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 1నుంచి 7వరకు పౌష్టికాహార నిర్వహణపై మహిళా, శిశు సంక్షేమ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో గర్భిణుల నమోదు, పౌష్టికాహారం తీసుకోవడం, రక్తహీనత తదితర సమస్యలపై సూచనలు చేయాలని అంగన్వాడీ వర్కర్లకు తెలిపారు. కార్య క్రమంలో సిడిపిఒ సుగుణకుమారి, నోడల్ అధికారి కె రాజేశ్వరి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు మరడాన కల్పన, ఎస్ లావణ్య, పాల్గొన్నారు.



సీతానగరంలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ, వైద్యాధికారి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

వీరఘట్టం : అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎప్పటికప్పుడు వైద్యాధికారులు సలహాలు తీసుకోవాలని గర్భిణులకు వివరించాలని కార్యకర్తలను ఆదేశించారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ప్రదీప్‌కుమార్, సూపర్వైజర్లు జనార్దన్‌రావు, శాంతికుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎన్.రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కురుపాం : సంపూర్ణత అభియాన్ నేషనల్ న్యూట్రిషన్ ఇస్తున్నటు శిక్షణను అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికమైన ఆహారం అందించాలని ఎంపిడిఒ ఎస్.అప్పారావు అన్నారు. మంగళవారం మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి బి.ప్రజ్ఞ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో హెల్త్ అండ్ న్యూట్రిషన్‌పై అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించి సమస్యలు ఏమైనా ఉంటే అవి ఏరకంగా పరీక్షించాలి, వాటిపై ఎలా అవగాహన కల్పించాలి, ప్రతి గర్భిణీ, బాలింతలకు కావాల్సిన సంపూర్ణమైన పోషణ అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది అందించేలా చూసి వాటి ద్వారా వచ్చే పోషకాలు, దాని విలువల గూర్చి తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హర్ష, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరం : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని వైద్యాధికారి పి.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభియాన్ పోషణ్ కార్యక్రమంపై ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారమందించడంతో పౌష్టికాహారంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి అవగాహన ఉండాలన్నారు, క్రమం తప్పకుండా నెలవారీగా వేసుకోవాల్సిన ఇంజక్షన్లు, ఆహారం గురించి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లావణ్య, ఎస్‌వి రవణ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని గొట్టివలస సమీపాన మంగళవారం హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల నుంచి సురక్షితంగా బయటపడొచ్చని తెలిపారు. రహదారి ప్రమాదాలకు ప్రధానంగా నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని చెప్పారు. ద్విచక్ర వాహన చోదకులు జాగ్రత్తగా వాహనాలు నడిపి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని కోరారు. అలాగే మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కృష్ణమోహన్, ఉమామహేశ్వరరావు, మందరాడ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: ప్రతి వాహనదారుడు హెల్మెట్లు తప్పక ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని కాశీపేట వద్ద వాహనదారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నగేష్‌రెడ్డి

నేత్రదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి - కురుపాం

నేత్రదానం వల్ల మనం మరణించిన మన కళ్లు వేరే వారికి చూపునిస్తుందని, కావున ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదానంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా మరణానంతర నేత్ర దానం చేసి ఇద్దరు అంధులకు చూపును ఇచ్చేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ మోహనరావు, నేత్ర వైద్య సహాయకులు మాలిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు చేరువలో వైద్య సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువలో వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని ఎమ్మార్ నగరంలో శ్రీకాకుళం జెమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ వంగపండు లక్ష్మి, త్రినాధ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ సేవలు రూ.25 లక్షల వరకు పెంచామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వాలు ఆసుపత్రులకు బకాయిలు ఉంచడం వల్ల, ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు ఆసుపత్రులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడిందని, తాము అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల బకాయిలను చెల్లించగలిగామని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సబ్‌సెంటర్లను బలోపేతం చేసి అధునాతన వైద్య సేవలు అందించేందుకు ఆలోచిస్తుందని, అందుకు తగిన ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేసిందని అన్నారు. ఈ సందర్భంలో గ్రామంలో 300 మందికి వైద్య పరీక్షలు జరిపి అవసరం మేరకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గొరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, జాగాన రవికుమార్, బి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘాల పోరాట ఫలితం

గురుకులాల్లో యువతులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - సాలూరు

ఏకలవ్య పాఠశాలల్లో ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ గిరిజన సంఘాలు చేపట్టిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. గిరిజన యువతులు పి.లావణ్య, పి.బంగారమ్మకు మన్యం జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల కళాశాలల్లో ల్యాబ్ అసిస్టెంట్లుగా నియమిస్తూ గిరిజన గురుకులాల సొసైటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొద్దినెలల క్రితం ఏకలవ్య పాఠశాలల్లో రెగ్యులర్ బోధనేతర, భోధనా సిబ్బంది నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో భాగంగా దరఖాస్తుదారులకు రాతపరీక్ష నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో అంతవరకు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించారు. ఈ విధంగా జిల్లాకు చెందిన లావణ్య, బంగారమ్మ కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు కోల్పోయారు. అయితే గిరిజనేతరులైన ఇద్దర్ని ఏకలవ్య పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిగా నియమించడానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సిఫార్సు చేయడంతో గిరిజన సంఘాలు భగ్గుమన్నాయి. ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ దశలవారీ ఆందోళన చేపట్టారు. వీరి పోరాట ఫలితంగా గిరిజన యువతకు ఉద్యోగాలు కల్పించడంపై గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

91మంది రైతులకు జీడి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని 14 పంచాయతీల్లో 91 మంది రైతులకు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ చేతుల మీదుగా జీడిమొక్కుల పంపిణీ మంగళవారం జరిగింది. ఆయా రైతులకు సుమారు 6650 జీడి మొక్కలను అందజేసినట్లు ఎపిఒ ఈశ్వరమ్మ తెలిపారు.

గణేష్ మండపాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని గణేష్ మండపాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులు అవగాహన పెంచుకోవాలని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. మంగళవారం ఆయన వినాయక మండపాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా ప్రచారం ప్రారంభించారు. పోలీసులు నిర్దేశించిన నిబంధనల ప్రకారం మండపాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువకులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా సైబర్ నేరాల బాధితులైతే వెంటనే సంప్రదించాలని కోరారు.

నదులు దాటేటప్పుడు జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని గోముఖీ, ఆడారు నదులు దాటేటప్పుడు ప్రజలు జాగ్రత్త వహించాలని మంగళవారం స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీం అన్నారు తుఫాను వల్ల నదులు ఉధతి ఎక్కువగా ఉందని, అలాగే ఎప్పటికప్పుడు గోముఖీ నది రెగ్యులేటర్లు గేట్లు ఎత్తివేస్తున్నందున నదిలో ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. కవిరిపల్లి వద్ద కాజ్‌వే దాటడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. దీనికి సంబంధించి హెచ్చరిక బోర్డులను ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

ప్రతి ఇంటిని సందర్శించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి గృహాన్ని ఆశా కార్యకర్తలు సందర్శించాలని స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గృహాలను సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. జ్వరాలు ఉన్నట్లయితే రక్త నమూనాలు సేకరించాలన్నారు. గర్భిణీలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమందేలా చూడాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా గర్భిణీలను ఆస్పత్రికి తనిఖీలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్ రావు, శాంత కుమారి ఏఎన్‌ఎం లు ఎంఎల్ హెచ్పీలు ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.